క్లుప్తంగా

విద్యార్థులకు గైడ్స్ పంపిణీ



విద్యార్థులకు గైడ్స్ అందజేస్తున్న రాంచంద్రయ్య తదితరులు

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ మాలె రాంచంద్రయ్య విద్యార్థులకు గురువారం గైడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కుమారుడి పుట్టిన రోజును పురస్కరించుకొని విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ గైడ్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నర్సింలు, నందు, రఘు, శంకర్, స్థానిక ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పూజ



పూజలో పాల్గొన్న బాహుబలి ప్రభాకర్ తదితరులు

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో సురేశ్‌గౌడ్ ఇంట్లో అయ్యప్ప స్వామి పూజను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర నామాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ వేడుకకు సినీ నటుడు ప్రభాకర్(బాహుబలి ఫేం) కుటుంబ సమేతంగా హాజరై పూజలో పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు ముదిగిండ్ల కృష్ణ, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, నాయకులు మల్లేశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కోతకు గురైన రోడ్డు



దేశాయిపల్లి వద్ద ప్రమాదకరంగా రహదారి

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్ నుంచి దేశాయిపల్లి మీదుగా ఇండాపూర్ వరకు వెళ్లే బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. దౌల్తాబాద్ గ్రామం దాటిన తర్వాత చింతల్‌చెరువు కట్ట ఓ వైపు కోతకు గురికావడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించడానికి వెళ్తే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే దేశాయిపల్లి గ్రామం దగ్గర ఓ వైపు రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఓ వైపు నుంచి వాహనాలు వస్తే మరో వైపు నుంచి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్యం అందాలి



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

బంట్వారం: గ్రామీణ ప్రజలకు అత్యవసర సేవలతో పాటు 24 గంటలు వైద్య సదుపాయం అందుబాటులోకి తేవడం అభినందనీయమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మెడిస్టార్ ఆస్పత్రిని గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపరుస్తునే ప్రైవేట్ రంగానికి సహకారం అందిస్తామన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



నమూనా ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థిని

కుల్కచర్ల: మండల పరిధిలోని సాల్వీడు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హబీబ్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అనేది ఎంతో గొప్పదని విద్యార్థులకు దీనిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ధరలు పెరిగి.. సాగు తగ్గి



మోమిన్‌పేటలో బెడ్డు పద్ధతిలో సాగు చేసిన పసుపు పంట

- పసుపు సాగుకు విముఖత చూపుతున్న రైతులు
- కూలీలు, పంట నిర్వహణకు అధిక ఖర్చులు
- ప్రభుత్వం రాయితీ కల్పించాలని వినతి

మోమిన్‌పేట: నీటి వసతి కలిగిన ప్రతి రైతు పసుపు పంటను సాగు చేసేవాడు. అర ఎకరా నుంచి రెండు మూడు ఎకరాల వరకు పసుపు వైపు మొగ్గు చూపేవారు. కాల క్రమేణ మార్కెట్‌లో ధర లేకపోవడం, పెట్టిన పెట్టుబడులకు గిట్టుబాటు కాకపోవడంతో పసుపు సాగును రైతులు పూర్తిగా మర్చిపోయారు. మండలంలోని ప్రతి గ్రామంలో సాగు నీటి వసతి కలిగిన రైతు పసుపు సాగు చేసే వారు. ప్రస్తుతం పసుపు సాగు చేసే వాని సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. మండలంలో 50 ఎకరాల సాగు గగనమే. పసుపు సాగుకు పెట్టుబడులు అధికమే కావాలి. దిగుబడులు రాకుంటే నష్టాలు తప్పవు. పసుపు కోతకు వచ్చినప్పుడు కూలీల ఖర్చు ఎక్కువే. మార్కెట్‌లో సుమారు 15 ఏళ్ల నుంచి ధర లేకపోవడంతో పసుపు సాగుకు విముఖత చూపారు. క్వింటాల్‌కు రూ.5 వేలు మాత్రమే వచ్చాయి. గతేడాది నుంచి క్వింటాల్‌కు రూ.10వేలు దాటుతుండటంతో సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు

గతంలో సాగు చేసిన మాదిరి కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. నాగలి వెంట విత్తనం వేయకుండా బోజ, బెడ్డు పద్ధతిలో సాగుకు సమాయత్తం అవుతున్నారు. బెడ్డులో విత్తనం తక్కువ పట్టడం, డ్రిప్ పద్ధతిలో నీరును పెట్టడంతో కొంత మేర కూలీల ఖర్చును తగ్గించుకొవచ్చని రైతులు పేర్కొంటున్నారు. అదే విధంగా బెడ్ డ్రిప్ పద్ధతిలో భూమి గుల్లగా ఉండి కొమ్ము సాగుకు అనుకూలంగా ఉంటుందని, దీంతో దిగుబడులు పెరుగుతాయని రైతులు అంటున్నారు. ఎరువులు, నీటి యాజమాన్యం సరైన పద్ధతిలో పాటిస్తే దిగుబడులు అధికంగా వస్తాయని ఉద్యానశాఖాధికారి గఫూర్ పేర్కొన్నారు. మళ్లీ పసుపు సాగు పెరగాలంటే ప్రభుత్వం విత్తన రాయితీ ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఎకరంన్నరలో సాగు చేశా



ఎకరంన్నరలో బెడ్డు పద్ధతిలో పసుపు సాగు చేశా. ఎరువులు, మందులను డ్రిప్ ద్వారా అందించడంతో పంట ఏపుగా పెరిగింది. మార్కెట్‌లో ధర రూ.10వేల పైన పలుకుతుండటంతో పసుపు పంటను సాగు చేశా. దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయని భావిస్తున్నా. – మోహన్‌రెడ్డి, రైతు, మోమిన్‌పేట

లైబ్రేరియన్ లేక.. నిర్వహణ సాగక

గ్రంథాలయానికి పార్ట్‌టైం వర్కరే దిక్కు



గ్రంథాలయంలో పాత పుస్తకాలు

దౌల్తాబాద్: శాశ్వత గ్రంథపాలకుడు లేక దౌల్తాబాద్ మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు గ్రంథాలయానికి 80 మందికిపైగానే పాఠకులు వెళ్తుంటారు. కానీ ఇక్కడ కేవలం పార్ట్‌టైం వర్కరే ఈ గ్రంథాలయానికి దిక్కయ్యారు. గ్రంథాలయానికి సొంత భవనం కూడా పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్మించినా, ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఉన్నత పాఠశాల ఆవరణలోని ఓ గదిలో కొనసాగిస్తున్నారు. గ్రంథాలయాన్ని ప్రశాంతమైన వాతావరణంలో ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

ఐదేళ్ల నుంచి ఇబ్బందులు

గ్రంథాలయానికి గత ఐదేళ్ల నుంచి శాశ్వత లైబ్రేరియన్ లేరు. అంతకుముందు ఉన్న లైబ్రేరియన్ ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. దీంతో గ్రామానికి చెందిన మంగలి వెంకటయ్య పార్ట్‌టైం వర్కర్‌గా గ్రంథాలయానికి పనిచేస్తున్నారు. ప్రతి రోజు పాఠకులకు పుస్తకాలు ఇవ్వాలన్నా మరే చదువుకు సంబంధించిన విషయానికైనా లైబ్రేరియన్ లేని దుస్థితి నెలకొంది. ఈ గ్రంథాలయంలో ఏళ్ల క్రితం వచ్చిన పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఉన్న సభ్యులకు పుస్తకాలు ఇవ్వలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయానికి శాశ్వత లైబ్రేరియన్‌ను నియమించాలని పాఠకులు కోరుతున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ



పరిగి: ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పరిగి: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులు లేకపోవడంతో ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా వసతులను కల్పించారు. పార్టీ నాయకులు కేక్‌లు కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు



కుల్కచర్ల: విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న నాయకులు

దోమ/కుల్కచర్ల: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నేతలు పలు పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. గురువారం మండల పరిధిలోని శివారెడ్డిపల్లి పాఠశాలలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు, పెన్సిల్స్‌లను పాఠశాల హెచ్‌ఎం నర్సింహులుతో కలిసి పంపిణీ చేశారు. కుల్కచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు.

బస్తాకు అరకిలో అదనం

- ధాన్యం కొనుగోలులో నిర్వాహకుల చేతివాటం
- ఇదేంటని నిలదీసిన రైతులు



ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులను నిలదీస్తున్న రైతులు

బొంరాస్‌పేట: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బస్తాలో నిబంధనలకు మించి ఎక్కువ ధాన్యాన్ని తూనిక చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూనికలో ఎక్కువ తీసుకొని తమను దగా ఎందుకు చేస్తున్నారని గురువారం నిలదీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రతి ధాన్యం బస్తాను 40 కిలోలు తూనిక ఉండగా, ఖాళీ సంచి 500గ్రాములు, ఇతర ఖర్చులు 500గ్రాములు, కాగా అదనపు ఖర్చులు, మిల్లర్ల వద్ద తూనిక తగ్గుతుందనే అడ్డగోలు పేర్లతో మరో 500గ్రాములు రైతుల నుంచి దండుకుంటున్నారు. దీన్ని వ్యతిరేకించి రైతులు కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్రాన్ని సందర్శించి నిలదీశారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఇకనుంచి అదనపు తూనికలు చేయనివ్వమని చెప్పడంతో విషయం సద్దుమణిగింది. మరోసారి ఇలాంటి సమస్యలు తలెత్తితే సహించమని నిర్వాహకులను హెచ్చరించారు. కాగా బుధవారమే ఈ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, అధికారులు సందర్శించి వెళ్లినా అడ్డగోలు తూనికలకు అడ్డుకట్టపడలేదేమని మండల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, డైరెక్టర్ మల్లేశ్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

అనంతగిరి: లయన్స్ క్లబ్, వికారాబాద్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్‌లో మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, ప్రతినిధులు సుదర్శన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అనంత్‌రెడ్డి తెలిపారు. అనంతగిరిరోడ్డులో క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. జనరల్ ఫిజిషియన్, ఆర్థో, చిన్న పిల్లలు, చర్మవ్యాధి, కంటి, స్త్రీవైద్య నిపుణులు తదితర డాక్టర్‌లు విచ్చేస్తున్నారన్నారు. అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు మేలు

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రైతు వేడుకలకు సంబంధించిన బ్యానర్‌ను గురువారం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేశారు.

జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్లు

దోమ: చలికాలంలో గొర్రెలు, మేకలకు సోకే మునర వ్యాధి(పారుడురోగం) పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని బొంపల్లి పశువైద్యాధికారి స్వప్న సూచించారు. గురువారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్‌ను వెటర్నిటీ అటెండర్ బాబయ్యతో కలిసి వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏటా జనవరి నుంచి వేసవి ముగిసే వరకు గొర్రెలు, మేకలకు మునరవ్యాధి సంభవిస్తుంటదన్నారు.

దివ్యాంగులకు పింఛన్ పెంచాలి

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పెంచుతామన్న పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని జాతీయ వికలాంగుల హక్కుల పోరాట టేకులపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మురళీధర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని టేకులపల్లిలో గ్రామ కార్యదర్శి మాధవికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంతో మంది పింఛన్‌దారులు, నూతనంగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారన్నారు.

అనుమానిత వ్యక్తుల సంచారం!

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామంలో గురువారం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు సంచారం కలకలం రేపింది. ఇటీవల ఓ బాలిక అదృశ్య సంఘటనతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. పిల్లలను ఎత్తుకెళ్లడానికి వచ్చిన దొంగలుగా భావించి గ్రామస్తులు ఆందోళన చెందారు. గనుల్లో పని చేసేందుకు వచ్చిన బిహార్‌కు చెందిన కూలీలుగా కొందరు అనుమానిస్తున్నారు. దీనిపై ఎస్ఐ విఠల్‌రెడ్డి స్పందిస్తూ.. విచారణ జరిపి వాస్తవాలు వెల్లడిస్తామని చెప్పారు.

బడుగుల ఆశాజ్యోతికి నివాళి



తాండూరు టౌన్: పూలే వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



యాలాల: మండల కేంద్రంలో నివాళులర్పిస్తున్న నేతలు

తాండూరు టౌన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబాపూలే అని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ కొనియాడారు. గురువారం జ్యోతిబాపూలే వర్ధంతిని పురస్కరించుకుని బీసీ సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. వెనుకబడిన కులాల అభివృద్ధి జరగాలంటే జ్ఞానమే సరైన మార్గమని, స్వతహాగా పాఠశాలలు స్థాపించి నిమ్న వర్గాలకు విద్య నేర్పించిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఆయన త్యాగం, తెగింపు, సేవానిరతిని బడుగు బలహీన వర్గాల ప్రజలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, షుకూర్, వెంకటేష్, బస్వరాజ్, సిద్ధిలింగం, ప్రేమ్, జోసఫ్, శివ, సయ్యద్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు వెలుగుల బాటలు వేసిన గొప్ప సంస్కర్త పూలే అని అన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

కొడంగల్ రూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ విజయకుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని నిర్వాహకులకు సూచించారు.

నాణ్యత లోపిస్తే చర్యలు



దోమ: విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ



దుద్యాల్: భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహించొద్దు
- తహసీల్దార్ పురుషోత్తం

దోమ: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. గురువారం మండల పరిధిలోని బొంపల్లి పాఠశాలలను ఎంఈఓ వెంకట్‌తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి సంహపంక్తి భోజనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాభివృద్ధి ఎంతో కృషి చేస్తుందన్నారు. నూతన పద్ధతులో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం నాణ్యతతో భోజనం అందిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫిసర్ రజిత, ఎంపీఓ సోమలింగం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫీ, ఉపాధ్యాయులు స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

దుద్యాల్: పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ కె.కిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హరిజన్వాడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన అందించాలని, రుచిగా వండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, పాఠశాల హెచ్‌ఎం అంజిలయ్య పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు



పూడూరు: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలో విద్యార్థులు ప్రతిభను కనబర్చారని బొంరాస్‌పేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. తమ పాఠశాల నుంచి ఆంగ్ల మాధ్యమం విద్యార్థులు అభ్యాస్, కీర్తన, సుహాసిని, తెలుగు మాధ్యమం నుంచి సమీనా, లక్ష్మిబాయి, పల్లవి, పోటీల్లో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో బృందం ఆర్గనైజర్ బాకారం చంద్రశేఖర్, ఉపాధ్యాయులున్నారు.

నేడు గణితం టాలెంట్ టెస్టు

మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం మండల కేంద్రంలో గణితం టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు ఎంఈఓ హరిలాల్ తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మధ్యాహ్నం 2గంటలకు ఈ టెస్టు ఉంటుందన్నారు.

కంకల్ పాఠశాల విద్యార్థులు

పూడూరు: జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలో మండల పరిధిలోని కంకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు గురువారం బహుమతులు అందుకున్న ప్రకాష్, శ్రీనిధి, వైష్ణవిలను కంకల్ పాఠశాల హెచ్‌ఎం పుష్ప, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

మహబూబ్‌నగర్‌కు తరలిన రైతాంగం



యాలాల: కార్యక్రమానికి వెళ్తున్న రైతులు



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో..



దుద్యాల్: బస్సు వద్ద మండల రైతులు

యాలాల: రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించే రైతు పండుగ కార్యక్రమానికి మండలం నుంచి గురువారం రైతులు తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సులో ఏఓ శ్వేతరాణి, ఏఈఓ మదన్‌మోహన్‌లతో కూడిన రైతుల బృందం సమావేశానికి వెళ్లారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల పండుగ కార్యక్రమంలో ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి తీసుకున్న చర్యలు వివరించనున్నట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమానికి వెళ్లిన వారిలో ఏఎంసీ డైరెక్టర్లు నర్సింహులుగౌడ్, శ్రీనివాస్, నాయకులు ఆరిఫ్, ఖాసీం, శ్రీనివాస్, బస్వరాజ్ తదితరులు ఉన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగకు పెద్దేముల్ నుంచి రైతులు తరలివెళ్లారు. వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీసీసీ మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు నసీర్, మాజీ సర్పంచులు కిషన్‌రావు, బాలప్ప, వెంకటయ్య, ఏఎంసీ డైరెక్టర్ ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

ధారూరు రైతులు

ధారూరు: మహబూబ్‌నగర్ జిల్లాలోని అమిస్తాపూర్ సమీపంలో గురువారం జరిగిన రైతు పండుగ మహాసభకు మండల రైతులు తరలివెళ్లారు. మండల ఏఈఓలు అన్నదాతలను వాహనాల్లో అక్కడికి తరలించారు.

దండు కదిలింది

బొంరాస్‌పేట: రాష్ట్రస్థాయి రైతుల పండుగకు మండలం నుంచి దండుగా కదిలారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లారు. వాహనాల్లో రైతులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మైనార్టీ మండలాధ్యక్షుడు అనీఫ్ తదితరులు వెళ్లారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: రాష్ట్ర సదస్సులకు మండలానికి చెందిన అన్నదాతలు గురువారం బయల్దేరారు. ఈ సందర్భంగా ఏవో తులసి మాట్లాడుతూ.. రైతు సదస్సులో వ్యవసాయ శాఖకు సంబంధించిన 150 రకాల ప్రదర్శనలు అందుబాటు ఉంటాయన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన పలు నూతన పరికరాలు, ఆవిష్కరణలు ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు.



పెద్దేముల్: రైతు పండుగను వెళ్తున్న మండల రైతులు